

పెంబర్తిలోని కౌంటింగ్ కేంద్రం వద్ద విజయ సంకేతం చూపుతున్న ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పల్లా, కడియం శ్రీహరి



విజయ సంకేతం చూపుతున్న కడియం శ్రీహరి, ప్రజాప్రతినిధులు, నాయకులు



పల్లగుట్టలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు



బచ్చన్నపేటలో సంబురాలు చేస్తున్న జాగృతి మహిళా నాయకులు



పల్లా, కడియంను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

# ఉద్యమ స్ఫూర్తితో ప్రతిపక్ష పాత్ర పోషిస్తా..

- **ప్రజల కోసం ఐదేళ్లు పాలేరునై పనిచేస్తా**
- **బీఆర్‌ఎస్ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

జనగామ, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన మాదిరిగానే ప్రజలిచ్చిన తీర్పుతో ప్రతిపక్ష పాత్రను పోషిస్తానని బీఆర్‌ఎస్ నుంచి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం పెంబర్తి ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్లు ప్రజల కోసం పాలేరునై పనిచేస్తానని.. నియోజకవర్గ ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి వారికి అండగా నిలిస్తానని పేర్కొన్నారు. తన గెలుపు కోసం 45 రోజులపాటు నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పని చేసిన ఫలితంగానే జనగామలో బీఆర్‌ఎస్ గెలిచిందన్నారు. రాత్రనక, పగలక పార్టీ కోసం పని చేసిన శ్రేణులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా, ఇదే స్ఫూర్తితో పనిచేద్దాం అని అన్నారు. గ్రామాలు, పట్టణ వార్డుల్లో ఇంటింటికీ తీసుకువెళ్లి తనను పరిచయం చేసి ఒక్కో నాయకుడు తానే అభ్యర్థి పల్లాగా భావించి కష్టపడ్డారని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఓటర్లను ప్రలోభ పెట్టాలని, దాడులు, దౌర్జన్యం, గూండాయిజం, రౌడీయిజంతో బెదిరించాలని చూసినా విచ



క్షణతో ఓటేశారని, అందుకే జనగామలో గెలుపు సాధ్యమైందని, నా విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలు మాత్రం కాలికి బలపం కట్టుకొని పార్టీ కోసం పని చేశారని, వారు నా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ప్రజలు కూడా నాపైన నమ్మకం పెట్టుకొని గెలిపించిన మేరకు చెప్పిన పనులను చేసేందుకు తనవంతు ప్రయత్నం ఉంటుందన్నారు. నన్ను నమ్మి గెలిపించిన ప్రజలకు, ఇతర జిల్లాల నుంచి మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అనేక కుట్రలు చేసి నా గెలుపును అడ్డుకునే ప్రయత్నం చేసినా నిర్భయంగా ఆలోచించి ఓటేసి నా గెలుపులో ప్రజల గెలుపు ఉంటుందని, ఓటర్లకు శిరస్సు వంచి నమస్కారిస్తున్న అని రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.

**జనగామలోనే నా నివాసం..**

ఇకపై జనగామ జిల్లా కేంద్రంగా నా స్థిర నివాసం ఉంటుందని, ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. మంచిని ఎవ్వరి వద్దా నుంచి అయినా నేర్చుకుంటా..చిన్న పెద్ద తేడా అనేది నాకు లేదని..ఇక నుంచి నీలిమ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ద్వారా జనగామ నియోజకవర్గ ప్రజలకు ఎంత ఖర్చైనా సరే ఉచిత వైద్య సేవలందించే బాధ్యత నాది అని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా మొత్తం ఒకవైపు ఉంటే జనగామ మరోవైపు నిలబడ్డదని..తెలంగాణ సాయుధ పోరాటం సహా నక్సలైట్ పోరాటం..ప్రత్యేక రాష్ట్ర సాధన తొలి, మలిదశ పోరాటంలో ముందున్నదని అన్నారు. చైతన్యవంతమైన జనగామ గడ్డ ప్రజలు నన్ను ఏ పాత్ర పోషించమని ఏ తీర్పు ఇచ్చారో దానికి కట్టుబడి వారి సేవ కోసం పనిచేస్తానని అన్నారు. నా విజయం జిల్లాలోనే కాదు, రాష్ట్రంలోనే ఘన విజయమని.. ఏ నమ్మకంతో అయితే గెలిపించారో అందరికీ పాదాభివందనం చేస్తున్నా అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణ హక్కులకు భంగం కలగనివ్వం

**స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**



స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 3 : 'ఉద్యమ నేత, సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణను సాధించుకున్నాం.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా అభివృద్ధి చేశామనే సంతృప్తి ఉందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు మరోసారి ఆశీర్వదించి విజయం అందించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు అధికార పక్షంగా పాత్ర పోషించామని, ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా ముందుకెళ్తామన్నారు. తెలంగాణ హక్కులకు భంగం కలిగితే ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్, మాకు ఒక్కసారి అవకాశం ఇవ్వండని ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ నేతలు ప్రజలను వేడుకోవడంతో ఈ తీర్పు వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని కోరారు.

**కడియం, పల్లాను అభినందించిన ఎమ్మెల్యే రాజయ్య**

జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరిని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య అభినందించారు. వారిని కలిసి పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఇదిలా ఉండగా ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కడియం శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపారు.



కడియం శ్రీహరి విజయంతో పెంబర్తిలో సంబురాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపుతో బచ్చన్నపేటలో సంబురాలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు